పార్లమెంటులో అదే రగడ

పట్టువీడని ప్రతిపక్షాలు

- దుండగుల చొరబాటుపై అమిత్ షా ప్రకటనకు పట్టు
- బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కార్యకలాపాలు చేపట్టకుండానే ఉభయ సభలు వాయిదా
- ప్రధాన నిందితుడు లలిత్‌కు 7 రోజుల పోలీస్ కస్టడీ

లోక్‌సభ స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: భద్రతా వైఫల్యంపై పార్లమెంటు శుక్రవారం కూడా అట్టుడికింది. పార్లమెంటులోకి దుండగుల చొరబాటుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలన్న డిమాండ్‌తో ఉభయ సభలను ప్రతిపక్షాలు స్తంభింపజేశాయి. విపక్ష సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకొన్నారు. అమిత్ షా ప్రకటన చేయాల్సిందేనని పట్టుబట్టారు. దుండగులకు పాస్‌లు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో శుక్రవారం సభలు ప్రారంభమైన నిమిషాల్లోనే మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోవటంతో లోక్‌సభ, రాజ్యసభను సోమవారానికి వాయిదా వేశారు.

చర్చకు సిద్ధం: కేంద్రం

భద్రతా వైఫల్యంపై సభలో చర్చించేందుకు సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తెలిపారు. విపక్షాలు నిరసనను విరమించి చర్చలో పాల్గొనాలని కోరారు. దుండగుల చొరబాటుపై ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభమైందని తెలిపారు. ఈ ప్రతిపాదనను విపక్షాలు తిరస్కరించాయి. హోం మంత్రి సభలో ప్రకటన చేయాల్సిందేనని పట్టుబట్టాయి. గురువారం 14 మంది విపక్ష ఎంపీలను చట్ట వ్యతిరేకంగా సస్పెండ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. టీవీ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తున్న హోంమంత్రి.. ఇంతటి కీలక అంశంపై పార్లమెంటులో ప్రకటన చేసేందుకు ఎందుకు ముందుకు రావటం లేదని ప్రశ్నించారు. 'గురువారం సాయంత్రం అమిత్ షా ఓ టీవీ చానల్‌తో మాట్లాడారు.. కానీ సభలో ప్రకటన చేసేందుకు మాత్రం ముందుకు రావటం లేదు. ఇది ఆయన అహంకారానికి పరాకాష్ట' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మండిపడ్డారు.

ప్లాన్ బీ కూడా సిద్ధం!

పార్లమెంటులోకి చొరబాటు కుట్రలో కీలక సూత్రధారిగా వ్యవహరిస్తున్న లలిత్ ఝాను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను ఢిల్లీ కోర్టులో హాజరుపర్చగా కోర్టు 7 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. అనంతరం తమ విచారణలో లలిత్ అనేక విషయాలు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు. పార్లమెంటులో నిరసన తెలిపేందుకు రెండురకాల ప్రణాళికలు వేసుకొన్నారని పేర్కొన్నారు. ప్లాన్ ఏ ప్రకారం నీలం, అమోల్ పార్లమెంటు లోపలికి ప్రవేశించి మీడియా కెమెరాల ముందు నినాదాలు చేస్తూ హల్‌చల్ చేయాలి. అది విఫలమైతే ప్లాన్ బీ ప్రకారం మహేశ్, కైలాశ్ మరో మార్గం గుండా పార్లమెంటులోకి ప్రవేశించి అనుకున్న పని పూర్తి చేయాలి అని నిర్ణయించుకొన్నారు. కానీ, మహేశ్, కైలాశ్ అనుకున్న సమయానికి గురుగ్రామ్‌లోని విశాల్ శర్మ ఇంటికి చేరుకోలేకపోవటంతో ప్రణాళికలో మార్పులు చేశారు' అని పోలీసులు వెల్లడించారు.



మథుర మసీదులో సర్వే..
స్టేకు సుప్రీం నిరాకరణ

షాహీ ఈద్గా మసీదు కమిటీ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ఉత్తరప్రదేశ్‌లోని శ్రీకృష్ణజన్మభూమి స్థల వివాదానికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. దీంతో షాహీ ఈద్గా మసీదుపై శాస్త్రీయ సర్వే చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 'ప్రార్థనా స్థలాల చట్టం-1991'ను అమలుజేయాలని, హైకోర్టు ఆదేశాల్ని నిలిపివేయాలంటూ షాహీ ఈద్గా మసీదు కమిటీ తరపున దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మథురలోని వందల ఏండ్ల క్రితం నాటి హిందూ ఆలయాన్ని కూల్చివేసి షాహీ ఈద్గా మసీదును నిర్మించారని, దానిని తిరిగి హిందువులకు అప్పగించాలని భగవాన్ శ్రీకృష్ణ విరాజ్‌మాన్, మరో ఏడుగురు వ్యక్తులు స్థానిక కోర్టును ఆశ్రయించారు. దీనిపై వివిధ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లన్నీ హైకోర్టుకు బదిలీ అయ్యాయి. అది మొదట్లో హిందూ ఆలయం అవునో, కాదో తేల్చేందుకు శాస్త్రీయ సర్వే నిర్వహించాలని గత ఏడాది డిసెంబర్‌లో స్థానిక కోర్టు తీర్పు ఇవ్వగా, దీనిని సమర్థిస్తూ అలహాబాద్ హైకోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. ఇందుకోసం అడ్వొకేట్ కమిషనర్‌ను నియమిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొన్నది. న్యాయవాదుల కమిషన్‌కు సంబంధించి వివిధవిధానాల్ని డిసెంబర్ 18న వెల్లడిస్తామని హైకోర్టు తెలిపింది.

మోదీ విద్యార్హతల కేసు..
కేజ్రీవాల్ అభ్యర్థన తిరస్కరణ

అహ్మదాబాద్: గుజరాత్ విశ్వవిద్యాలయం దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తాను పబ్లిక్ సర్వెంట్‌నని, తనను విచారించాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలని కేజ్రీవాల్ వాదించారు. ఈ వాదనను అహ్మదాబాద్ కోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఈ కేసులో విచారణను కొనసాగించవచ్చునని చెప్తూ ఈ నెల 28కి వాయిదా వేసింది. ప్రధాని మోదీ డిగ్రీకి సంబంధించిన కేసులో గుజరాత్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆదేశాలను ఆ రాష్ట్ర హైకోర్టు గతంలో తోసిపుచ్చింది. అనంతరం కేజ్రీవాల్, ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గుజరాత్ విశ్వవిద్యాలయంపై వ్యాఖ్యలు చేశారు.

వచ్చే ఏడాది అయోధ్యలో
మసీదుకు శంకుస్థాపన!

అయోధ్య, డిసెంబర్ 15: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఓ పక్క రామాలయ నిర్మాణం పూర్తి చేసుకుని జనవరిలో ప్రాణ ప్రతిష్ఠకు సిద్ధమవుతుండగా, మరో పక్క అయోధ్యలో వచ్చే ఏడాది మసీదు నిర్మాణానికి శంకుస్థాపన జరుగనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పవిత్ర మక్కా మసీదుకు చెందిన ఇమామ్ దీనికి శంకుస్థాపన చేస్తారు. 2019లో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ మసీదుకు భూమిని కేటాయించింది. దేశంలోనే అతి పెద్ద మసీదును ఇక్కడ నిర్మిస్తామని, 21 అడుగుల ఎత్తు, 36 అడుగుల వెడల్పున ప్రపంచంలోనే అతి పెద్ద ఖురాన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్టు మహ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు అభివృద్ధి కమిటీ చైర్మన్, బీజేపీ నేత హాజీ అరాఫత్ షేక్ తెలిపారు.

రైళ్లలో జీరో వెయిటింగే లక్ష్యం

రూ.లక్ష కోట్లతో కొత్త రైళ్లు

మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: వెయిటింగ్ లిస్టులు, ఆర్ఏసీల బాధల నుంచి త్వరలో రైల్వే ప్రయాణికులకు విముక్తి లభించనుంది. రూ.లక్ష కోట్లతో కేంద్రం భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పాత రైళ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త రైళ్లను రానున్న సంవత్సరాల్లో తీసుకురానున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సుమారు 7 వేల నుంచి 8 వేల జతల కొత్త రైళ్లను ఈ పథకంలో భాగంగా ప్రవేశపెట్టనున్నారు. నాలుగైదు ఏండ్లలో టెండర్ ప్రక్రియ చేపడతామన్నారు. 15 ఏండ్ల ఈ దీర్ఘకాల ప్రణాళికలో కొత్త కారిడార్‌లు ఏర్పాటు చేస్తామని, జీరో వెయిటింగ్ లిస్టు లక్ష్యంగా ఈ ప్రణాళిక చేపడుతున్నామన్నారు.

జనవరి 10లోగా తేల్చండి

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మహారాష్ట్ర స్పీకర్‌కు సుప్రీం ఆదేశం

మరోసారి గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: శివసేనలోని ఏక్‌నాథ్ షిండే, ఉద్ధవ్ ఠాక్రే వర్గాలు ఒకరిపై మరొకరు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు గడువును సుప్రీంకోర్టు పొడిగించింది. ఈ పిటిషన్లపై ఈ నెల 31 నాటికి నిర్ణయం తీసుకోవాలని గతంలో మహారాష్ట్ర శాసన సభ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ నెల 20 వరకు శాసనసభ సమావేశాలు జరుగుతాయని, అందువల్ల ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు వీలుగా సమంజసమైన రీతిలో గడువును పొడిగించాలని సభాపతి సుప్రీంకోర్టును కోరారు. దీంతో ఈ పిటిషన్లపై వచ్చే జనవరి 10లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. శివసేనలోని ఉద్ధవ్ ఠాక్రే వర్గం, ఎన్సీపీలోని శరద్ పవార్ వర్గం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలిచ్చింది. మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శివసేనను చీల్చి, దాదాపు 40 మంది ఎమ్మెల్యేలతో కలిసి, బీజేపీతో చేతులు కలిపి, 2022 జూన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎన్సీపీని అజిత్ పవార్ చీల్చి, శివసేన-బీజేపీ ప్రభుత్వంలో చేరారు. షిండే, ఉద్ధవ్ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లలో ఎదుటి వర్గంలోని ఎమ్మెల్యేల శాసన సభ్యత్వాలను రద్దు చేశాయని స్పీకర్‌ను కోరాయి.

మైనర్‌పై రేప్.. బీజేపీ ఎమ్మెల్యేకు 25 ఏండ్ల జైలు

- రూ.10 లక్షల జరిమానా
- యూపీలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సంచలన తీర్పు
- సభ్యత్వం కోల్పోనున్న ఎమ్మెల్యే

లక్నో, డిసెంబర్ 15: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌ను దోషిగా తేల్చుతూ ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు తీర్పు వెలువరించింది. సోన్‌భాద్రాలోని ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఉల్లాఖాన్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌కు 25 ఏండ్ల కఠిన జైలు శిక్ష విధించటమేగాక, రూ.10 లక్షల జరిమానా చెల్లించాలంటూ తీర్పు చెప్పారు. ఈ మొత్తాన్ని బాధితురాలికి అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రజాప్రాతినిధ్య చట్టం కింద, ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌పై అనర్హత వేటు పడనున్నది. దీంతో ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోనున్నారు. అంతేగాక అతడిపై మరో 6 సంవత్సరాలపాటు నిషేధం అమలవుతుంది. ఈ కేసులో తన క్లయింట్‌కు కఠిన శిక్ష విధించవద్దని ఎమ్మెల్యే తరపు న్యాయవాది జడ్జిని వేడుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో ఆదుకుంటాడని విన్నవించుకున్నాడు. కాగా ఆయన వాదనను జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. మ్యోర్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2014 నవంబర్ 4న లైంగికదాడి ఘటన చోటుచేసుకుంది.

నీ కొడుకును చంపేస్తా..
జడ్జికి బెదిరింపు కాల్

లక్నో: యూపీలోని బాలియా జిల్లా జడ్జి అశోక్ కుమార్ కుమారుడిని చంపుతామంటూ బెదిరించిన గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం, జడ్జికి ఈ నెల 10న ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి, తాను కొత్వాలీ సదర్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందినవాడినని, ఎన్‌కౌంటర్‌లో మీ అబ్బాయిని చంపేస్తాం అని చెప్పాడు. దీనిపై గురువారం ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని పోలీసు సూపరింటెండెంట్ ఎస్ ఆనంద్ చెప్పారు. జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల భద్రత గురించి సివిల్ కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌ను సంప్రదిస్తున్నామని తెలిపారు.

ఉక్రెయిన్‌లో గ్రనేడ్లతో కౌన్సిలర్ దాడి

26 మందికి గాయాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: పశ్చిమ ఉక్రెయిన్‌లో ఓ గ్రామ కౌన్సిలర్ తోటి సభ్యులపై గ్రనేడ్‌తో దాడి చేయడంతో 26 మంది గాయపడ్డారు. ముఖజీవ్ జిల్లా కెరెట్స్కి గ్రామంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా ఆ కౌన్సిలర్ జేబులోంచి మూడు గ్రనేడ్లు బయటకు తీసి విసిరాడు. దీంతో సభ్యులు భయంతో అరుస్తూ పెద్దగా కేకలు వేశారు. గ్రనేడ్ పేలుడుకి 26 మంది గాయపడగా, అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కౌన్సిలర్ ఎందుకీ చర్యకు పాల్పడిందీ వెల్లడి కాలేదు. కాగా, రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న క్రమంలో పౌరులు ఆయుధాలు కలిగి ఉండటానికి ఉక్రెయిన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో చాలామంది మారణాయుధాలు ధరించి తిరుగుతున్నారు.

గుజరాత్ పిల్లల్లో పోషకాహార లోపం

- **న్యూట్రిషియన్ రిహాబిలిటేషన్ సెంటర్లలో 41 వేల మందికి పైగా చిన్నారుల చేరిక**
- **మూడేండ్లలో రెట్టింపైన సంఖ్య**

అహ్మదాబాద్, డిసెంబర్ 15: గుజరాత్‌లో వేలాది మంది చిన్నారులు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న ఐదేండ్ల లోపు చిన్నారుల్లో న్యూట్రిషియన్ రిహాబిలిటేషన్ సెంటర్లలో(ఎన్ఆర్సీ) చేరే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంటున్నది. గత మూడేండ్ల వ్యవధిలో 41,632 మంది చిన్నారులు ఎన్ఆర్సీలలో చేరారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గత మూడేండ్ల వ్యవధిలో ఈ సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగించే అంశం. ఈ మేరకు లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆరోగ్య శాఖ వివరాలు వెల్లడించింది. ఐదేండ్ల లోపు చిన్నారుల్లో ఆరోగ్యపరమైన సమస్యలతో కూడిన పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో 2020-21లో 29 రాష్ట్రాలు/యూటీల వ్యాప్తంగా 1.04 లక్షలుగా ఉన్నదని, ఇది 2022-23కి 1.89 లక్షలకు పెరిగిందని తెలిపింది. గుజరాత్‌లో 2020-21లో 9,906గా ఉన్న ఈ సంఖ్య 2022-23కి రెట్టింపై 18,978కి చేరిందని పేర్కొన్నది. ఈ ఏడాది జూన్ వరకు 5,634 మంది న్యూట్రిషియన్ రిహాబిలిటేషన్ సెంటర్లలో చేరారు. గుజరాత్‌లో ఏడాదికి సగటున 12 లక్షల మంది చిన్నారులు జన్మిస్తారని, వీరిలో దాదాపు 30 వేల మంది నేటికి కూడా మరణిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి హిరేన్ బ్యాంకర్ విమర్శించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గత ఐదేండ్లలో 7 లక్షలకు మందికి పైగా పోషకాహారం లోపం సమస్య బారిన పడ్డారని పేర్కొన్నారు. కాగా, గుజరాత్‌లో 39 శాతం మంది చిన్నారులు వయసుకు తగ్గ బరువు లేరని ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 సర్వే పేర్కొన్నది.

కర్ణాటకలో మళ్లీ 'టిప్పు' వివాదం

మైసూర్ ఎయిర్‌పోర్టు పేరు మార్చాలని అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రతిపాదన

వ్యతిరేకించిన బీజేపీ శాసనసభ్యులు

బెంగళూరు, డిసెంబర్ 15: కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ జగడంలో 'టిప్పు సుల్తాన్' మరోసారి కేంద్ర బిందువుగా మారారు. మైసూర్‌లోని 'మందకల్లి ఎయిర్‌పోర్ట' పేరును టిప్పు సుల్తాన్ ఎయిర్‌పోర్టుగా మార్చాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య ప్రతిపాదనలు చేయడం దుమారం రేపింది. అసెంబ్లీలో గురువారం విమానాశ్రయాల పేర్ల మార్పు అంశంపై చర్చ సమయంలో ఆయన చేసిన ఈ ప్రకటనను ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించారు. సభలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రెండు పార్టీల ఎమ్మెల్యేల మధ్య వాదోపవాదనలు జరిగాయి. అయితే మైసూర్ కాకుండా.. హుబ్బళ్లి, బెళగావి, శివమొగ్గ, విజయపుర విమానాశ్రయాల పేర్లను మార్చాలని కేంద్రాన్ని కోరుతూ చేసిన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదింపజేసుకొన్నది.

మహిళా జడ్జికి లైంగిక వేధింపులు

- ఆత్మహత్యకు అనుమతివ్వాలని సీజేఐకి లేఖ రాసిన యూపీ జడ్జి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు
- నన్ను ఓ పురుగులా చూస్తున్నారు
- ఇక ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన
- హైకోర్టు నుంచి నివేదిక కోరిన సీజేఐ

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: దేశంలో సామాన్యులకే కాదు న్యాయమూర్తులకూ లైంగిక వేధింపులు తప్పడం లేదు. సీనియర్ న్యాయమూర్తి ఒకరు తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని యూపీకి చెందిన ఓ మహిళా జడ్జి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. తనను ఓ పురుగులా చూస్తున్నారని, ఫిర్యాదుచేసినా పట్టించుకోవట్లేదని, ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతివ్వాలని లేఖలో కోరారు. దీనిపై స్పందించిన సీజేఐ చంద్రచూడ్.. తక్షణమే నివేదిక అందజేయాలని అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను శుక్రవారం ఆదేశించారు.

అసలేం జరిగింది..

పని ప్రదేశంలో ఎదురవుతున్న లైంగిక వేధింపులు, అవమానకర పరిస్థితులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడతా.. అంటూ ఉత్తరప్రదేశ్ బాందా జిల్లా జడ్జి అర్పితా సాహూ సీజేఐకి లేఖ రాశారు. బారాబంకి జిల్లా కోర్టులో పనిచేస్తుండగా జిల్లా జడ్జి, అతడి అనుచరుల నుంచి లైంగిక వేధింపులు, అవమానాలు, మానసిక, శారీరక వేధింపులు ఎదుర్కొన్నానని సీజేఐకి రాసిన రెండు పేజీల లేఖలో ఆరోపించారు. అందులోని వివరాల ప్రకారం, 'సామాన్య ప్రజలకు న్యాయం చేసేందుకు న్యాయ వృత్తిలో చేరిన నేను.. ఇప్పుడు అదే న్యాయం కోసం వేరొకరి తలుపు తట్టాల్సి వస్తున్నది. గత కొన్ని నెలలుగా జిల్లా న్యాయమూర్తి, ఆయన అనుచరులు నాపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. రాత్రి పూట జిల్లా న్యాయమూర్తి ఒంటరిగా కలవమంటున్నారు' అని ఆ మహిళా జడ్జి తన లేఖలో పేర్కొన్నారు. 'దీని గురించి ఈ ఏడాది జూలైలో హైకోర్టు అంతర్గత ఫిర్యాదుల కమిటీ దృష్టికి తీసుకెళ్లాను. కానీ, ఎలాటి ప్రయోజనం లభించలేదు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకు సదరు న్యాయమూర్తిని మరో చోటకు బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశా. కానీ సెకన్ల వ్యవధిలో నా అభ్యర్థనను కొట్టివేశారు. ఇక నేను బతికుండి ప్రయోజనం లేదు. గౌరవప్రదంగా చనిపోయేందుకు నాకు అనుమతివ్వండి' అంటూ లేఖలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

> 'ఒక జిల్లా జడ్జి, అతని సహాయకులు నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశాక, ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. ఇందులో సాక్ష్యులు నిందితుడైన జిల్లా జడ్జి కింద పనిచేసే ఉద్యోగులు. వీరు తమ బాస్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఎలా చెబుతారు? పారదర్శకమైన విచారణ కోసం సదరు జడ్జిని బదిలీ చేయాలని పిటిషన్ వేస్తే.. సుప్రీంకోర్టు దానిని 8 సెకన్లలో కొట్టేసింది. నా కనీస అభ్యర్థనను కూడా కోర్టు పట్టించుకోలేదు'
> – లేఖలో మహిళా జడ్జి ఆవేదన

11 ఏండ్లలో మారిందేమీ లేదు

నిర్భయ తల్లి ఆవేదన

న్యూఢిల్లీ: దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాల గురించి 'నిర్భయ' తల్లి ఆశా దేవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరి సహకారంతో తమకు న్యాయం జరిగిందని చెప్పారు. అయితే చట్టాలు వస్తున్నప్పటికీ, ఫలితం ఉండటం లేదన్నారు. మార్పు రావడం లేదనే భావం కొన్నిసార్లు తమను నైరాశ్యానికి గురి చేస్తున్నదని చెప్పారు. చాలా మంది బాధితులు తమ వద్దకు వస్తున్నారని, తాము కేవలం నైతిక మద్దతు మాత్రమే ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. వ్యవస్థ సక్రమంగా పని చేయాలన్నారు. 'నిర్భయ'పై సామూహిక అత్యాచారం జరిగి 11 ఏళ్లవుతున్నా దేశంలో మహిళలపై నేరాలు తగ్గడం లేదన్నారు.

పిల్లలకు కథలు చెప్పడంలో తల్లిదండ్రుల గిన్నిస్ రికార్డ్

పుణే : పిల్లలకు కథలు చెప్పడంలో భారతీయ తల్లిదండ్రులు చైనాను వెనక్కు నెట్టి గిన్నిస్ రికార్డ్ సృష్టించారు. మహారాష్ట్రలోని పుణేలో ఉన్న ఎస్‌పీ కళాశాల మైదానంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో 3,250 మంది తల్లిదండ్రులు, వారి పిల్లలు పాల్గొన్నారు. కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎన్‌బీటీ చైర్‌పర్సన్ మిలింద్ మరథే మాట్లాడుతూ తల్లిదండ్రులు సామూహికంగా తమ పిల్లలకు 4 నిమిషాల సేపు కథలను చదివి, వినిపించే కార్యక్రమాన్ని నిర్వహించామని, దీనిలో 3,250 మంది పాల్గొనగా 3,066 మంది విజయవంతంగా ఈ లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు.

మైండ్ రీడింగ్ హెల్మెట్

సిడ్నీ, డిసెంబర్ 15: 'ఆదిత్య 369' సినిమా చూశారా? మనసులో అనుకొన్న విషయాలు స్క్రీకర్లలో వినిపించడం గమ్మత్తుగా అనిపించింది కదూ. ఇప్పుడు దాదాపుగా అలాంటి పరికరాన్నే ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, సిడ్నీ పరిశోధకులు తయారు చేశారు. మనసులోని ఆలోచనలను అక్షరీకరించే హెల్మెట్ లాంటి డివైజ్‌ను (మైండ్ రీడింగ్ హెల్మెట్) వీళ్లు అభివృద్ధి చేశారు. ఎలక్ట్రోఎన్సఫలోగ్రామ్ (ఈఈజీ) సాంకేతికతతో ఈ డివైజ్ పని చేస్తుందన్నారు. పక్షవాతం, వివిధ ప్రమాదాల్లో గాయపడి మాట్లాడలేని వారు ఈ పరికరం సాయంతో తమ భావాలను ఇతరులకు సులభంగా వ్యక్తపరుచవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

త్వరలో ఎక్స్ ద్వారా లావాదేవీలు

న్యూయార్క్, డిసెంబర్ 15: ట్విట్టర్‌ను చేజిక్కించుకున్నప్పటి నుంచి తనదైన మార్పులు చేస్తున్న ఎలాన్ మస్క్.. మరో ముందగుడు వేయబోతున్నారు. ఇప్పటికే ట్విట్టర్ పేరును ఎక్స్‌గా మార్చారు. ఇప్పుడు ఆ యాప్‌ను అన్నింటికి ఒకే వేదికగా చేయాలని అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా, ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకొనే సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించారు. తాజాగా ఎక్స్ కోసం అమెరికాలోని పెన్సిల్వేనియా ప్రభుత్వం నుంచి మనీ ట్రాన్స్‌మిటర్ లైసెన్స్ కూడా పొందారు. అంటే.. ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకొనేందుకు ఎక్స్‌కు అనుమతి లభించిందన్న మాట. అయితే, ఈ సదుపాయం యూజర్లకు 2024 చివరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

హెచ్-1బీ వీసాలకు తగినన్ని దరఖాస్తులు

వాషింగ్టన్: 2024 ఆర్థిక సంవత్సరానికి జారీచేయాల్సిన హెచ్-1బీ విదేశీ ఉద్యోగ వీసాల పరిమితిని చేరుకునేందుకు తగినన్ని దరఖాస్తులు అందినట్టు అమెరికా యూఎస్‌సీఐఎస్ ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 మధ్య కాలానికి నిర్దేశించిన 65 వేల సాధారణ హెచ్-1బీ వీసాలు, 20 వేల హెచ్-1బీ అడ్వాన్స్‌డ్ డిగ్రీ (మాస్టర్స్) వీసాల పరిమితిని చేరుకునేందుకు తగిన దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించింది. ఈ వీసాలకు ఎంపికకాని దరఖాస్తుదారులకు కొద్ది రోజుల్లో వారి ఆన్‌లైన్ ఖాతాల ద్వారా నాన్-సెలక్షన్ నోటీసులు పంపుతామని, పరిమితి నుంచి మినహాయించిన పిటిషన్ల స్వీకరణ, ప్రాసెసింగ్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

భారత పర్యాటకులకు వీసా-ఫ్రీ ఎంట్రీ: ఇరాన్

*న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ఇరాన్‌ను సందర్శించాలనుకునే భారత పర్యాటకులకు ఆ దేశం శుభవార్త చెప్పింది. ఇక నుంచి వీసా లేకుండానే ఆ దేశాన్ని సందర్శించవచ్చని ప్రకటించింది. భారత్ సహా 33 దేశాల వారు వీసాల లేకుండా తమ దేశాన్ని సందర్శించవచ్చునని ఇరాన్ దేశ మం